
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

ఆదివారం 14 ఏప్రిల్ 2024

శనివారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 34.0°C | కనిష్ఠం : 24.5°C

కేడర్‌లో.. లోకల్ జోష్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

పార్లమెంట్ పోరు ముగియగానే స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం పూర్తి కాగా, జూన్, జూలై నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో స్థానిక ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తల పనితీరు ప్రతిపాదికన పోటీకి అవకాశం ఇస్తామని తమ పార్టీ కేడర్‌కు సీఎం భరోసానిచ్చారు. మరోవైపు ప్రతిపక్షాల్లోనూ ఈ ప్రకటన జోష్ నింపతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,567 మందికి సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవులు రానుండటంతో పాటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కూడా కేడర్‌ను ఊరిస్తున్నాయి.

జూలైలో స్థానిక సమరం

పార్లమెంట్ ఎన్నికల్లో తమ నేతల విజయాల కోసం మండుటెండలో శ్రమిస్తున్న కేడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చల్లని కబురు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేశారు. మే 13న తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండగా జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం చేసిన ప్రకటన ప్రకారం జూలైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందనే అభిప్రాయాలున్నాయి. అయితే ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి 1వ తేదీన పదవీకాలం ముగిసింది. అయితే బీసీ జనాభా లెక్కలు తేలకపోవటంతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. గ్రామ పంచాయతీలకు పర్సన్ ఇంచార్జ్‌లుగా అధికారులను ప్రభుత్వం నియమించింది. జూలై నెల మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో సర్పంచ్ స్థానాలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూడా జూలై, ఆగస్టుల్లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688 గ్రామ పంచా యతీలు ఉండగా, కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 74 జడ్పీటీసీ పదవులకు, 805 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,567 మందిని పదవులు వరించనున్నాయి. ఇటీవల కొత్తగా భూపాలపల్లిలో గోరికొత్తపల్లి, మహబూబాబాద్ జిల్లాలో ఇనుగుర్తి, సిరోలు మండలాలు ఏర్పడ్డాయి. వీటిలో కొత్తగా



లోక్‌సభ పోరు తరువాత స్థానిక సమరం

మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) స్థానాలను పెంచే అవకాశం ఉంది. ఎంపీటీసీల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే 2009 నుంచి ములుగు జిల్లా మంగపేట మండలంలో 115 ఎంపీటీసీ స్థానాలకు, 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేవు. ఈసారి వీటికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే జనవరి మునిసిపాలిటీల పదవీ కాలం పూర్తికానుంది. ఫిబ్రవరిలో సహకార సంఘాల పదవీకాలం ముగిసి పోనుంది. వీటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తే మునిసి పల్ కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు కూడా ద్వితీయ శ్రేణి నేతలకు దక్కనున్నాయి. అలా గే సహకార సంఘం ఎన్నికల్లో

- జూలైలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ప్రాతిపదికనే అవకాశాలన్న సీఎం
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీలపై ఆశలు
- ప్రతిపక్ష నేతల్లోనూ హుషారు
- ఉమ్మడి జిల్లాలో 2,567 మందికి స్థానిక పదవులు

జిల్లా	సర్పంచులు	ఎంపీటీసీ	జడ్పీటీసీ
వరంగల్	323	134	11
హనుమకొండ	208	129	12
భూపాలపల్లి	241	117	12
ములుగు	174	87	09
మహ-బాద్	461	198	18
జనగామ	281	140	12
మొత్తం	1,688	805	74

నామినేటెడ్ పదవులు.. ఇందిరమ్మ కమిటీలు

డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురికి వివిధ స్థాయిలో కార్పొరేషన్ పదవులు లభించాయి. అయితే జిల్లా స్థాయి, వ్యవసాయ కమిటీలు, ఆలయ కమిటీలను నియమించాల్సి ఉంది. వీటన్నింటిని కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత నియ మిస్తామని సీఎం ప్రకటిం చటంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపి నట్లైంది. అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు, వాలంటీర్ల నియామకం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. దీంతో ప్రతి గ్రామం నుంచి పది మం దికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇం దిరమ్మ కమిటీలు, వలంటీర్ల పదవులు లభించే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన తీరును బట్టే పదవులు ఇస్తామని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు లింకు పెట్టడంతో ఎంపీ అభ్యర్థుల గెలుపునకు శ్రమించక తప్పని పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరు గుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా వరం గల్ లోక్‌సభ స్థానం నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ స్థానం నుంచి బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. దీంతో వీరి గెలుపు బాధ్యతలను సీఎం పరోక్షంగా కార్యకర్తలపై భుజస్కంధాలపై పెట్టారన్న చర్చ జరుగుతోంది.

గెలిచిన డైరెక్టర్లకు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు అవకాశాలు రానున్నాయి.అలాగే పీఏసీఎస్ చైర్మన్ల నుంచి డీసీసీబీ డైరెక్టర్‌గా, చైర్మన్‌గా, ఓడీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ లాంటి పదవులు జిల్లా స్థాయి నేతలకు లభించనున్నాయి. సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తరువాత మునిసిపాలటీ, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి మార్చి వరకు అన్ని రకాల ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఆ తరువాత నుంచి పరిపాలనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కాగా, లోక్‌సభ ఎన్నికల

మిగతా 7వ పేజీలో..



కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు అప్రమత్తంగా ఉంటూ, చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో, కొత్తగా గుర్తించిన పోలింగ్‌కేంద్రాల్లో కనీస మౌళిక వసతులైన విద్యుత్, ర్యాంప్‌లు, టాయిలెట్లు, తాగునీరు, తదితర మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లపై దృష్టిపెట్టి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎలక్షన్స్ సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, ఆర్వోలు, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం సూపరిండెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



మహనీయుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భూక్య మురళీనాయక్

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : మహనీయుల ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపుచ్చారు. మల్యాలలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో మహనీయుల జయంతి కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలతో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. దాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మహనీయుల త్యాగాలతో మనందరం రిజర్వేషన్ల ద్వారా ఫలాలను పొందుతున్నామని చెప్పారు. జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మందుల మహేందర్, ముత్తయ్య, శేఖర్, వెంకన్న, చీమ్లానాయక్, సుం దర్, లింగయ్య, చెన్నయ్య, రమేష్ పాల్గొన్నారు.



పార్కులో ప్రజలతో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 13 : ప్రజలు ఆహ్లాదం కోసం పార్కులు, తదితర ప్రదేశాలకు వచ్చినపుడు సంబంధిత అధికారులు ఆయాప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కును సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. మునిసిపల్ అధికారులు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలేదని ప్రజలు తెలపడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కు ఆవరణలో స్విమ్మింగ్ పూల్, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగినా అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనవద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య, వింజూరి సుధాకర్, ఉపేందర్, వాకర్స్, పిల్లలు ఉన్నారు.

మందులిప్పిస్తానని.. బంగారం దోపిడీ

అలస్యంగా ఫిర్యాదు చేసిన బాధితురాలు

మట్టెవాడ, ఏప్రిల్ 13 : వరంగల్ ఎంజీఎం హాస్పటల్‌లో చికిత్సపొందుతున్న మహిళ వద్ద అటెండెంట్‌కు ఓ గుర్తు తెలియని మహిళ మందులు ఇప్పిస్తామని బంగారంతోపాటు రూ.వేయి నగదును దోచుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం గోవిందాపురంనకు చెందిన బోయిని సమ్మక్క ఫిబ్రవరి 24న అనారోగ్యం దృష్ట్యా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స కోసం చేరింది. సమ్మక్క కోడలు బోయిని కొమురమ్మ అత్తతోపాటే కోడలు ఎంజీఎంలో సహాయకురాలిగా చేరింది. ఫిబ్రవరి 25న గుర్తు తెలియని మహిళ బురఖా వేసుకొని వచ్చి చికిత్స పొందుతున్న బోయిని సమ్మక్కకు మందులిస్తాను అని తనతో రమ్మని కోడలు కొమురమ్మను ఎంజీఎం ఆస్పత్రి నుంచి బయట గోపాల్‌స్వామి గుడి వద్దకు తీసుకొచ్చింది. అక్కడ ఒక వ్యక్తి సాయంతో గుర్తు తెలియని మహిళ కొమురమ్మను చంపుతామని బెదిరించి ఆమెవద్ద నుంచి బంగారు కమ్మలు, అర తులం పుస్తెలు, రూ.వేయి నగదును లాక్కొంది. ఈ మేరకు కొమురమ్మ అత్త సమ్మక్క చికిత్స పొందుతూ మార్చి 18న మృతిచెందింది. దీంతో ఆలస్యంగా వారంరోజుల క్రితం ఫిర్యాదు చేయడంతో, శనివారం మట్టెవాడ పోలీసులు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్వారీ గుంతలో పడి బాలిక మృతి



నిఖిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : జిల్లా కేంద్రం శివారు గౌతమబుద్ధడి కాలనీ సమీపంలోని ఓ క్వారీ గుంతలోప్రమాదవశాత్తు బాలిక పడి, మృతి చెందింది. టౌన్ ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం బంచరాయితండాకు చెందిన బోడ వీరన్న-కుమారి దంపతులు మహబూబాబాద్ శివారు గౌతమబుద్ధడి కాలనీలో గత మూడేళ్ల క్రితం గుడిసె వేసుకుని నివాసముంటున్నారు. ఈ క్రమంలో కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు అనూష, నిఖిత (11), గౌతమి సంతానం. నిఖిత మహబూబాబాద్ శివారు గాంధీపురం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి విద్యనభ్యసిస్తోంది. అదే కాలనీకి చెందిన గుగులోతు శ్రీను కుమార్తె శృతితో కలిసి సమీపంలో ఉన్న క్వారీలోని ఓ గుంతలో ఉన్న నీటివద్దకు వెళ్లి రోజువారీగానే బట్టలను శుభ్రం చేసుకునే వారు. శనివారం మధ్యాహ్నం కూడా శృతితో కలిసి నిఖిత, అనూష, గౌతమి బట్టలు శుభ్రం చేసేందుకు వెళ్లారు. వారితో పాటు అదే కాలనీకి చెందిన ఉప్పలమ్మ కూడా వెళ్లింది. ఉప్పలమ్మ బట్టలు శుభ్రం చేస్తుండగా నలుగురు గుంతలోకి దిగి ఆడుకుంటున్నారు. నిఖిత ఆడుకుంటూనే కొంతదూరం వెళ్లి మునిగిపోతుండాన్ని ఉప్పలమ్మ గమనించి గట్టిగా కేకలు వేయడంతో ముగ్గురు పిల్లలు గుంతలో నుంచి బయటకు వచ్చారు. కానీ, నిఖిత బయటకు రాలేకపోయింది. ఈ విషయాన్ని మిగత వారు నిఖిత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు గుంత వద్దకు వచ్చే సరికి ఊపిరి ఆడక నీటిలో మునిగి నిఖిత మృతి చెందింది. ఈ విషయంపై నిఖిత తండ్రి వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గెలుపోటముల్లో బూత్ అధ్యక్షులదే కీలకం

కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్



మహబూబాబాద్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అభయ్‌పాటిల్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : గెలుపు, ఓటముల్లో బూత్ అధ్యక్షుల పాత్ర కీలకంగా ఉంటుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో శనివారం మానుకోట పార్లమెంట్ పరిధిలోని బూత్ అధ్యక్షులతో విజయసంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో 370 ఓట్లకంటే ఎక్కువగా పడే విధంగా చూడాలని చెప్పారు. కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని చెప్పారు. ఏడు నియోజకవర్గాల పరిధి నుంచి సుమారు 4 వేల మంది బూత్‌స్థాయి అధ్యక్షులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 12ఎంపీ స్థానాలను తప్పక బీజేపీ గెలుచుకుంటుందని,అందులో మహబూబాబాద్ ఎంపీ సీటు ఒకటని చెప్పారు. ప్రతీ బూత్‌లో కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను ఓటర్లకు వివరించాలన్నారు.

త్వరలో భద్రాచలానికి మోదీ..

భద్రాచలంకు త్వరలోనే ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉందని అభయ్‌పాటిల్ అన్నారు. ములుగు జిల్లాలోని మేడారం 'సమ్మక్క-సారలమ్మ' జాతరకు జాతీయ హోదా కల్పించేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. గిరిజన జిల్లా మానుకోటలో శ్రీసంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతికి కూడా జాతీయ హోదా కల్పించేందుకు చూస్తామన్నారు.

బీజేపీ మానుకోట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ మాట్లాడుతూ దేశంలో మోదీ ఆధ్వర్యంలో నిశబ్ద విప్లవం వచ్చిందని, మూడోసారి ఆయననే ప్రధాని చేసేందుకు ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మునుగు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభారి వెంకటనారాయణరెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ సింగారపు సతీష్, మోసంగి మురళి, ఇందుభారతి, వెంకటచారి, కొమ్మాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ధర్మారపు వెంకన్న, శశివర్దన్‌రెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం నాణ్యతగా తీసుకువస్తే మద్దతు ధర

జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.వెంకట్‌రెడ్డి



మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 13 : పూర్తిగా ఆరబెట్టి, తాలులేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.వెంకట్‌రెడ్డి రైతులకు సూచించారు. మహబూబాబాద్ మార్కెట్‌లో శనివారం వ్యాపారులతో సమావేశమై, ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలని కోరారు. రైతు సోదరులు రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే సరుకులు లోనికి అనుమతించబడి లాట్ ఐడీ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రతిరోజు ధాన్యం విన్నర్‌లిస్టు (ధరలు తెలిపే) ఉదయం 10.30కు ప్రకటిస్తారని తెలిపారు. మార్కెట్ లైసెన్స్ కలిగిన వ్యాపారులు మాత్రమే ప్రతిరోజు బిడ్డింగ్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి ఎండి. శంషీర్, సూపర్‌వైజర్ రమేష్, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయొద్దు

కేసముద్రం : వ్యాపారి తన వ్యాపార సంస్థ ఉన్న ప్రాంతంలో తప్పనిసరి పరిస్థితుల్లో రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లు జరిపినప్పటికీ మార్కెట్ నిబంధనలను పాటించాలని, ఇలాంటి కొనుగోళ్లలో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయవద్దని జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకు కొనుగోలు చేసిన తేదీనే చెక్కు, ఆర్టీజీఎస్ ద్వారా రైతులకు చెల్లింపులు చేయాలని అన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఉన్న సరుకులకు అంతకంటే ఎక్కువ రేటును ఈ-వేలంలో నమోదు చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి చార్జీల మినహాయింపు మార్కెట్ నిర్ణయించిన మేరకే చేయాలని, అంతకంటే ఎక్కువ చార్జీలు కోత పెట్టవద్దని తెలిపారు. సమావేశంలో ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్-3 కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, ఛాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరు రమేష్, బిజ్జాల వెంకటేశ్వర్లు, వోలం ప్రభు కిరణ్, సంకెపల్లి జనార్ధన్‌రెడ్డి, చిదిరాల వసంతరావు, శ్రీరాం కిరణ్, ప్రదీప్, ప్రమోద్, ఆగె నాగరాజు, సంపత్‌రెడ్డి, పింగిళి తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదు

- ఏజెన్సీ వాసులను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్
- కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్



మాట్లాడుతున్న బలరాం నాయక్

వాజేడు(ములుగు జిల్లా), ఏప్రిల్13 : ఏజెన్సీ ప్రాంతవాసుల సంక్షేమాన్ని పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే అర్హత లేదని కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విమర్శించారు. భద్రాచలం మాజీఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి ఆయన మండలంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వాజేడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన సమయంలో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. పూసూరు-ముళ్లెకట్ట వంతెన నిర్మాణంలో కీలకంగా వ్యవహరించానన్నారు. భద్రాచలం నుంచి వాజేడు వరకు రెండు లేన్ల రహదారి నిర్మాణానికి కృషి చేశానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని అన్నారు. ఎంపీ కవిత ఏజెన్సీ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న మోడికుంట ప్రాజెక్టును పూర్తి చేయిస్తానని, నర్సింగ్, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. పారాగన్ చెప్పుల కంపెనీని ఈ ప్రాంతంలో ఏర్పాటు

మిగతా 8వ పేజీలో..



మానుకోట పట్టణంలో ర్యాలీగా వస్తున్న ఎన్డీ నేతలు

'ఆర్ఎస్ఎస్, మోదీ ఫాసిజానికి అడ్డుకట్ట వేయాలి'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ఆర్ఎస్ఎస్, మోదీ ఫాసిజానికి అడ్డుకట్ట వేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రెండుసంస్థల రాష్ట్రనేతలు సాధినేని వేంకటేశ్వర్‌రావు, అవునూరి మధు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో శనివారం మానుకోట నియోజకవర్గస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ పదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా హిందుత్వ ఫాసిస్టు శక్తులు పెట్రేగిపోతున్నారని చెప్పారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనార్టీలపై దాడులు, హింస పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ముస్లిం, క్రిష్టియన్, మైనార్టీ మతాలకు వ్యతిరేకంగా హిందు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశసమైక్యతకు, లౌకికప్రజాస్వామిక విధానాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంతో విప్లవకారుల నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పోరాటాలు జరిగాయని చెప్పారు. గోదావరి లోయలో చెంద్రపుల్లారెడ్డి నాయకత్వాన ప్రారంభించి గత ఐదున్నర శతాబ్దాలుగా ప్రతిఘటన పోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాల భూములను ఆదివాసీ గిరిజనులకు సాధించి పెట్టిన ఘనత ఎన్డీ పార్టీలకే దక్కిందన్నారు. గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, జడ సత్యనారాయణ, నందగిరి వెంకటేశ్వర్లు, యాకన్న, శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, నాగేశ్వర్‌రావు, ఊకె పద్మ, రమేష్, లింగ్యానాయక్, చారీ హరీష్, భట్టు చైతన్య, బోనగిరి మధు, తిరుపతమ్మ, సారంగపాణి, వీరభద్రం పాల్గొన్నారు.

నేడు లక్ష్మక్క జాతర



అప్పరాజుపల్లిలో లక్ష్మక్క దేవాలయం (ఇన్‌సెట్లో) లక్ష్మక్క విగ్రహం

గూడూరు, ఏప్రిల్ 13 : మండలంలోని అప్పరాజు పల్లిలో ఆదివారం (నేడు) లక్ష్మక్క జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి దారావత్ బిచ్యా తెలిపారు. ప్రతీ సంవత్సరం జాతర అత్యంత వైభవంగా నిర్వహిం చడం జరుగుతుందన్నారు. అప్పరాజుపల్లితో పాటు గోవిందపురం, జంగుతండా, కొల్లాపురం, బొద్దుగొండ, జగన్నాయకులగూడెం గ్రామాల నుంచి అధిక మొత్తంలో భక్తులు హాజరవుతారని చెప్పారు. ఏటా ఉగాది పండుగ అనంతరం లక్ష్మక్క జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు.

నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్‌నిర్మించాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 13: కాకతీయరాజులు రామప్ప గుడి సమీపంలోని రామానుజపురంలో నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూ టాలయం శిథిలావస్థలో ఉందని, దాన్ని పునర్‌నిర్మించాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల సమాజం అభివృద్ధి కోసం రూ.500కోట్లు ఎరుకల కార్పొరేషన్‌కు కేటాయించి విద్యావంతుడైన ఎరుకల కులస్తుడినే చైర్మన్‌గా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆదివాసీ, గిరిజన తెగల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు

ఈసమావేశంలో ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్దిల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు బూనాద్రి రంజిత్‌కుమార్, బిజిలి ప్రశాంత్, దుగ్యాల రమేష్, పులిచేరు రవీందర్, పులిచేరు చంద్రయ్య, లోకిని చందర్, మానుపాటి సురేందర్, పులిచేరు చిన్న సారయ్య, పల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, కేతిరి రాజు, కుతాడి శ్రీనివాస్, రేవెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అగ్గి అంటుకుంటే బుగ్గే..

- నగరంలో విరివిగా అగ్ని ప్రమాదాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- కమర్షియల్ కాంప్లెక్సుల్లో ఫైర్‌సేఫ్టీ నిల్
- ఎన్‌వోసీలు తీసుకున్న దాఖలాలు లేవు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అగ్గి అంటుకుంటే బుగ్గే అనే పరిస్థితి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో కేవలం పదమూడుమాత్రమే ఫైర్ స్టేషన్‌లున్నాయి. వరంగల్ నగరంలో కేవలం రెండు స్టేషన్‌లు మాత్రమే ఉండటం విశేషం. నగర విస్తీర్ణంతో పాటు వ్యాపార సముదాయ భవనాలు, విద్యాకేంద్రాలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాల సంఖ్య వేగంగా పెరుగుతున్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌ల సంఖ్య పెరగలేదు. ఏజెన్సీ ఏరియాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఇక అంతే సంగతులు, ములుగులో ఉన్న స్టేషన్‌నుంచి వాహనం వెళ్లేలోగా జరిగే నష్టం జరిగి తీరుతుంది. ఏటూరునాగారం ఏరియాలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ పాలకులు దృష్టి సారించకపోవడం గమనార్హం. నియోజకవర్గ కేంద్రాలకే ఫైర్‌స్టేషన్‌లు పరిమితం కావడంతో ఫలితం లేకుండా పోతోంది. వరంగల్ నగరం మినహా ప్రతీ నియోజకవర్గ విస్తీర్ణం ఎటూ 50 కిలోమీటర్లకు పైగానే ఉంటుంది. ఇలా స్టేషన్‌ల సంఖ్య పెంచకపోవడం, పాత వాహనాలు, అరకొర సిబ్బంది ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటం విశేషం. ఈక్రమంలో ఆదివారం నుంచి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంది.

నిబంధనలకు నీళ్లు

వరంగల్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు విరివిగా జరుగుతున్నాయి. వరంగల్ నగరంలో వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థల భవనాలు, ఆస్పత్రుల భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న వారు నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. ప్రతీ వ్యాపార సముదాయాల్లో ఫైర్ వాహనం తిరిగేలా స్థలం, ఫైర్‌సేఫ్టీ పరికరాలు, ఎమర్జెన్సీ ద్వారాలు ఇలా ఏర్పాట్లు తప్పనిసరి. అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలి. ఇలాంటి సౌకర్యాలులేని భవనాలే ఎక్కువగా నగరంలో ఉన్నాయి. అధికారుల చేతులు తడుపుతున్న వ్యాపారులు నిబంధనలు బుట్టదాఖలు చేస్తూ అనుమతులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అందినంత దండుకుంటున్న అధికారులు తనిఖీలు చేసిన పాపానపోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇటీవల వరంగల్‌లో జకోటియా కాంప్లెక్సులో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటన, గతంలో హనుమకొండలో జుబేర్ బుక్ స్టాల్, కల్యాణలక్ష్మీ సారీ సెంటర్‌లో, కరీంనగర్ రోడ్డులోని ఒక పెట్రోల్ పంపులో జరిగిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ సంఘటనల్లో మూడురోజుల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తే కానీ మంటలు నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. ముందస్తు చర్యలు లేకపోవడం వల్లనే అగ్ని ప్రమాదాలు నిలువరించలేని దుస్థితి ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. వారోత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాకుండా వ్యాపార సముదాయాల్లో నిత్యం తనిఖీలు చేస్తూ నిబంధనలు కఠినతరం చేయాల్సి ఉంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి


మామిడి భగవాన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్, వరంగల్



ముందస్తు చర్యలతో అగ్ని ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చు. వ్యాపార సముదాయాలు నిర్మించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఫైర్ సెఫ్టీ చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 8712699304, 8712699305 నంబర్లకు సమాచారం అందించాలి. ఆదివారం నుంచి వారంపాటు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్

అర్హత సాధిస్తేనే పదోన్నతులు
ప్రత్యేక పరీక్ష నిర్వహించాలంటున్న టీచర్లు



జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పాసైతేనే పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు విధించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన తాము ప్రస్తుతం పదోన్నతులు పొందేందుకు టెట్ తప్పనిసరి పాస్ కావాలనే నిబంధన పెట్టడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టెట్ అర్హత సాధించడం ఇప్పుడు సాధ్యమయ్యే పని కాదని, తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా రాష్ట్ర విద్యాశాఖ మాత్రం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతో పాటే ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని అంటోంది. ఏప్రిల్ నెలలో టెట్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని పేర్కొంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

టెట్ నిర్వహణ ఇలా..

టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పూర్తి పేపరు 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీలు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పేపర్ - 1 ఉత్తీర్ణత కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఇంగ్లీషు, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలుంటాయి. పేపర్ - 2 లో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ అంశాలన్నీ చదవడం ఇబ్బందికరమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలని చెబుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవన్నీ తాము చదవలేమని, తమకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2009 లోనే టెట్ ఉత్తర్వులు

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అంటే 2009 లోనే ప్రభుత్వం టెట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో కొత్తగా డీఎస్సీ రాయాలనుకునేవారికి టెట్ నిర్వహించింది. కాని ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారు కూడా టెట్ రాయాలని చెప్పలేదు. ఆ తరువాత 2013 లోనూ, 2015 లోనూ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టింది. ఈ పదోన్నతుల్లో వారికి టెట్ మినహాయింపు ఇచ్చింది. అంతెందుకు ఇటీవల జరిగిన మల్టిజోన్ స్థాయి బదిలీల్లో కూడా టెట్ కు ప్రాధాన్యత కల్పించలేదు. మల్టిజోన్-1 లో జరిగిన బదిలీలు పొందిన వారికి టెట్ అడగలేదు. ఇతర కారణాల చేత మల్టిజోన్-2 లో బదిలీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మల్టిజోన్-2 లో బదిలీలు పొందేవారు కూడా టెట్ రాయాలనడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని యాజమాన్యాలలో కలిపి 2500 మంది ఉపాధ్యాయులున్నారు. వీరిలో దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత లేనివారే.

హేతుబద్ధత ఏది?

అసలు టెట్ నిర్వహణకు హేతుబద్ధత లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యోగానికి డీఎస్సీ రాస్తే సరిపోతుందని, డీఎస్సీకి అర్హులైతే చాలని, ఉద్యోగార్హతకు, డీఎస్సీకి మధ్య ఈ టెట్ హేతురహితమని అంటున్నారు. ఎక్కడా లేని విధంగా టెట్ అర్హతకు ఓసీ, బీసీ, ఎస్సీలకు రకరకాల మార్కులను నిర్ణయించడం సరికాదని చెబుతున్నారు. కాగా పీఎస్ హెచ్ఎంలు ప్రైమరీ స్కూళ్లలో బోధిస్తారని, విధులు మాత్రం ఎస్‌జీటీ స్థాయిలో ఉంటాయని, అటువంటి వారు లెవెల్-1 పరీక్ష రాయాలా, లెవెల్-2 పరీక్ష రాయాలా అనేది ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని అంటున్నారు. పండిట్ టీచర్లు పేపర్-1 కానీ పేపర్-2 కానీ రాయలేరని, ఎందుకంటే వారికి సంబంధించిన సిలబస్ ఆ పేపర్లలో ఉండదని, వారికి ప్రత్యేకమైన ప్రశ్నాపత్రం ఉండాలని, అలాంటి వారు పదోన్నతులు పొందాలంటే ఎలా అనేదానికి విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి..

దొమ్మాట శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం టెట్‌కు సమాయత్తమవుతున్న వారితో పోటీపడి పరీక్ష రాసే పరిస్థితులు కల్పించొద్దు. టెట్ నిర్వహణ హేతురహితంగా ఉంది. పీఎస్‌హెచ్ఎంలు, పీజీ హెచ్ఎంలు, పండిట్లు ఏ పరీక్ష రాయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తప్పనిసరి పరిస్థితుల్లో టెట్ నిబంధన అమలు చేస్తే 2010 తరువాత నియామకమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

కేడర్‌లో.. లోకల్ జోష్

5వ పేజీ తరువాయి

తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావటంతో క్యాడర్‌ను పదవులు ఊరిస్తున్నాయి.

ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం..

లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఫైట్ ఉంటుందని సీఎం ప్రకటించటంతో ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతం వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు దీటుగా కాంగ్రెస్ జడ్పీటీసీలు, ఎంపీ టీసీ లు విజయం సాధించారు. చాలా చోట్ల బీజేపీకి చెందిన సర్పంచులు, ఎంపీ టీసీలు కూడా గత ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఉమ్మడి వరం గల్‌లోని ఆరు జడ్పీ చైర్మన్లు కూడా బీఆర్‌ఎస్ పరిధిలోనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవటంతో నేతలు, కార్యకర్తలు వలస బాట పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా బలపడుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తమ అభ్యర్థి గెలిస్తే, లోకల్ బాడీ ఎన్నికల్లో తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారు. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనపై కాంగ్రెస్ క్యాడర్‌తో పాటు ప్రతిపక్షాల కార్యకర్తలు కూడా జోష్‌లో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మార్కెట్లో వేలంలో మారిన సమయపాలన

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 13: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇబ్బంది పడకుండా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం నుంచి జూన్ 15 వరకు వేలం పాటల సమయాలలో మార్పులు చేసినట్లు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్కెట్లో మిర్చి బీటు ఉదయం 7.05 గంటలకు, పత్తి బీటు 8.05 గంటలకు, పల్లికాయ బీటు 8.15గంటలకు, పసుపు బీటు 8.30 గంటలకు, అపరాల బీటు 8.45 గంటలకు మారినట్లు తెలిపింది. అలాగే ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ప్రతీ బుధవారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది. రైతులు, కార్మికులు, అడ్తి, ఖరీదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరింది.

17 నుంచి ఉచిత కోచింగ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి నిర్వహించేకామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్రత విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ (బ్లెండెడ్ విధానం)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, కేడీసీ రసాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.రమేశ్ తెలిపారు. ఉచిత శిక్షణ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభం అవుతుందని, 60రోజులపాటు జరుగుతోందని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఏ కళాశాలకు చెందిన వారైన ఉచిత శిక్షణకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 98669-62589 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న జిల్లాస్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 13: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన అండర్-17 ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాలబాలికల చెస్ పోటీలను టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ ప్రతినిధి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా 1 జనవరి 2017లోపు జన్మించిన 7ఏళ్ల బాలబాలికలు ఈ చెస్‌పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం బెల్టు షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.24వేల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో రూ.6760, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లిలో రూ.7360, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కంపేటలో రూ.5140, అగ్రంపహాడ్‌లో రూ.4560 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు.

ఉత్తమ బోధన.. నాణ్యమైన విద్య

• మానుకోట కేంద్రీయ విద్యాలయంలో సీట్లకు డిమాండ్ • రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థుల ఎంపిక • రేపే రిజిస్ట్రేషన్లకు తుదిగడువు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 : ఉత్తమ బోధన, నాణ్యమైన విద్యకు చిరునామాగా కేంద్రీయ విద్యాలయాలు నిలుస్తున్నాయి. కేంద్రప్రభుత్వం, మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యాలయాల్లో ప్రవేశాలకు ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. ఒకటో తరగతిలో ప్రవేశం పొందితే పదో తరగతి వరకు చదివే వెసులు బాటు ఉంటుంది. క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దడం, ప్రయోగపూర్వక బోధనతో పాటు క్రీడలు, యోగ, ఎన్‌సీసీ మొదలగు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ బోధనచేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయాల్లో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఎవరికి ప్రాధాన్యం అంటే..

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించింది. కేంద్రీయ విద్యాలయాల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ, రక్షణరంగసంస్థల్లో విధులు నిర్వహిస్తున్నపిల్లల తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాల బాలికలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.2024-25 విద్యా సంవత్సరంలో మహబూబాబాద్ పట్టణంలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి నుంచి 9వ వరకు ప్రవేశాలు కల్పించేందుకు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు షెడ్యూల్ విడుదల చేసి, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది .

సీట్ల కేటాయింపు ఇలా..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సెంట్రల్ బోర్డుసెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌తో తరగతులు కొనసాగుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. గతంలో 1వ తరగతిలో ప్రవేశాలకు 40 సీట్లు ఉండగా 2024-25 విద్యాసంవత్సరం నుంచి 1వ తరగతిలో-32 సీట్లకు తగ్గించి సీట్లను భర్తీ చేయనున్నారు.

2వ తరగతి నుంచి 10వ తరగతుల్లో మిగిలిన సీట్లను లాటరీ పద్ధతిలో భర్తీ చేస్తారు. ఇందులో ప్రతీ తరగతిలో ఆర్‌టీఈలో 25 శాతం (8 సీట్లు), ఎస్సీ విద్యార్థులకు-15 శాతం (05సీట్లు) ఎస్టీ విద్యార్థులకు 7.5శాతం (02సీట్లు) ఓబీసీ విద్యార్థులకు 27 శాతం (08 సీట్లు), దివ్యాంగులకు 3 శాతం (01సీటు) రిజర్వేషన్ చొప్పున సీట్లను భర్తీ చేస్తారు. ఒకటో తరగతిలో 2024-25 విద్యాసంవత్సరం నుంచి 32 సీట్లను భర్తీ చేయనుండగా, ఇందులో పైరిజ ర్వేషన్‌ను పాటిస్తూ సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది.

తరగతుల వారీగా అర్హత వయస్సు ..

1వ తరగతిలో ప్రవేశం పొందాలంటే 2024 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 6 నుంచి 8 ఏళ్ల మధ్య ఉండాలి. 2వ తరగతిలో 7 నుంచి 9 ఏళ్ల మధ్య, 3, 4వ తరగతిలో 8 నుంచి 10, 5వ తరగతికి 9 నుంచి 11, 6వ తరగతికి 10 నుంచి 12, , 7వ తరగతికి 11 నుంచి 13, 8వ తరగతికి 12 నుంచి 14, , 9వ తరగతికి 13 నుంచి 15 , 10వ తరగతికి 14 నుంచి 16 సంవత్సరాల మధ్య ఉండాలి. ఇలా ప్రతీ తరగతికి నిర్దేశించిన వయసు మేరకు రిజర్వేషన్, ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపునిస్తూ ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంపిక విధానం ఇలా..

కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎలాంటి పరీక్షలు లేకుండానే విద్యార్థుల



మహబూబాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయం

ఎంపిక ఉంటుంది. ప్రయారిటీ సిస్టమ్ ప్రకారం సీటు కేటాయిస్తారు. సీట్లసంఖ్య కంటే దరఖాస్తులు ఎక్కువ వస్తే లాటరీ పద్ధతితో విద్యార్థులను ఎంపిక చేస్తారు. 9వ తరగతిలో ఏమైనా ఖాళీలున్నట్లయితే ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారు.

వీరికి మాత్రమే పరీక్ష..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. ఒకటవ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా, ఇతర తరగతులకు ఆఫ్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల సంఖ్యకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లయితే లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. 9వ తరగతిలో ప్రవేశాలకు మాత్రం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. హిందీ. ఇంగ్లీష్, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల నుంచి ప్రశ్నలుంటాయి. ఒక్కో సబ్జెక్టు నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలుగా నిర్ణయించారు. విద్యార్థులు పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

1 నుంచి 9 తరగతుల వరకు ప్రవేశాలు

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 15 (సోమవారం) వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ, కులం, సర్వీస్ సర్టిఫికెట్, నివాసంతో పాటు రెండు పాస్‌ఫొటోలతోవెబ్‌సైట్ https://kvsonlineadmission.kvs.gov.in//index.html,.https://kvsonlineadmission.kvs.gov.in దరఖాస్తు చేసుకోవాలి. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన
- కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్

కేంద్రీయ విద్యాలయంలో అనుభవజ్ఞులైన, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులచే బోధన చేస్తున్నాం. సీబీఎస్ఈ సెలబస్‌తో ప్రయోగపూర్వక బోధనతో పాటు క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దడం, క్రీడలు, యోగ, మొదలగు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 15 చివరి తేదీ. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆ పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదు

(5వ పేజీ తరువాయి)

చేయిస్తానన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయటమే లక్ష్యంగా పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

పొదెం వీరయ్య మాట్లాడుతూ తనను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించడం బాధ కలిగించిందని, మళ్లీ అతప్పు పార్లమెంటు ఎన్నికల్లో చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించి రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. పార్టీలోకి ఎవరూ వచ్చిన పర్వా లేదన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి కష్టపడ్డ నాయకులను గుర్తించి గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నల్లాపు దుర్గాప్రసాద్, రసూల్, యశోద రాంబాబు, మురహరి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..

వెంకటాపురం (నూగూరు) : తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఈప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అన్నారు. మండలకేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. వాజేడు మండలంలో గోదావరినదిపై వంతెన నిర్మాణం, రోడ్ల నిర్మాణం, పాలెం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిగాయని అన్నారు. తన విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లపు దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు సత్యనారాయణ, పాయం రమణ, చిడెం మోహన్‌రావు, చింతిరాల రవి, శ్రీనివాస్, మన్నెం సునీల్, చిడెం శివ, కొండపర్తి సీతాదేవి, గార్లపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్‌తండాలో ఆరోగ్య శిబిరం

డోర్నకల్, ఏప్రిల్ 13 : మునిసిపల్ పరిధిలోని సిగ్నల్ తండా, లాల్యతండాలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. తండాలో గత నాలుగు రోజులుగా కొందరు కీళ్లనొప్పులు, జ్వరంతో బాధపడుతున్నందున విషయం తెలుసుకున్న డోర్నకల్ సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరం కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 17 మందిని పరీక్షించి వారికి మందులను ఉచితంగా అందజేశారు. పరీక్షల నిమిత్తం వారి నుంచి సేకరించిన రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపించారు. వైద్యులు అరుణ్‌కుమార్, సిబ్బంది శోభన, విజయ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యారంగంలో మార్పు కోసం పోరాడిన జార్జిరెడ్డి

● పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు నరేష్

కొత్తగూడ, ఏప్రిల్ 13 : భారతదేశంలో విద్యావిధానాన్ని మార్చి శాస్త్రీయ విద్యాసాధనకు, విద్యారంగ సమూల మార్పు కోసం పోరాడి ప్రాణాలర్పించిన జార్జిరెడ్డి ఆశయం కోసం పాటుపడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అల్వాల నరేష్ పిలుపునిచ్చారు. కొత్తగూడ మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ 1972 ఏప్రిల్ 14న హిందూ మతోన్మాదులైన ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ చేతిలో జార్జిరెడ్డి మరణించాడని ఆరోపించారు. ప్రభుత్వం విద్యారంగానికి సంబంధించిన మౌళిక వసతులను కల్పించాలని, లేకుంటే పోరాటాలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కన్నాభిరామం, లక్ష్మణ్, రాము, వెంకటేష్, రాజు, సతీష్, రాజా, బాలు, శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

తొర్రూరు, ఏప్రిల్ 13 : దేశంలో బ్రిటీష్ వలస కాలం నాటి విద్యా విధానాన్ని సమూలంగా మార్చి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్ యూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సంతోష్ అన్నారు. శనివారం శాస్త్రీయ విద్యాసాధనకై పోరాడి ప్రాణాలు వదిలిన జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్ యూ నాయకులు లక్ష్మణ్, కుమార్, దేవేందర్, శేఖర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 12 : మామపై దాడి చేసిన అల్లుడిపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారానికి చెందిన గొట్టం మానసతో నయింనగర్‌లో నివాసం ఉంటున్న పిల్లల నాగరాజుకు వివాహమైంది. ఇద్దరి మధ్యలో గొడవలు జరుగుతుండటంతో వేర్వేరుగా ఉంటున్నారు. శనివారం నాగరాజు దగ్గర ఉన్న తన సామగ్రిని తండ్రి రాములుతో కలిసి ఆటోలో తీసుకెళ్తుండగా రాములుకు, నాగరాజుకు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో నాగరాజు రాములుపై దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుడి కూతురు మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

డోర్నకల్, ఏప్రిల్ 13 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి బండి నర్సింహారావు అన్నారు. డోర్నకల్‌లో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు చేసి ఎన్నో హక్కులను సాధించిన ఘనత యూటీఎఫ్‌దని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 11ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. జిల్లా నాయకులు నామ వెంకటేశ్వర్లు వివేక్, అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, కాసు మారెడ్డి, ఎండీ అమిన్, సోమనబోయిన శ్రీను, సాత్విక్, నిజామియా, అమీనా, శకుంతల, శాంతకుమారి, సాహెబ్‌ఆలీ, హచ్యానాయక్, రాములు, లక్ష్మీప్రసాద్, సీతారాములు పాల్గొన్నారు.

● గార్ల : టీఎస్ యూటీఎఫ్ వార్షికోత్సవంలో భాగంగా మండలకేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘ సంఘం జిల్లా నాయకుడు భద్రునాయక్ జెండాను ఆవిష్కరించి, మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే మూడు లక్ష్యాలతో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తులసిదాస్, మాచర్ల సందరయ్య, మధు, ఎల్లయ్య, చంద్రసింగ్, ఎం.రాము, అలివేలు, రజిని, అనురాధ, లక్ష్మీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కురవి : తెలంగాణలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో టీఎస్-యూటీఎఫ్ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కురవిలో సంఘ పతకాన్ని ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.రాజశేఖర్, యూ.సురేష్, ఉపాధ్యాయులు ఎం.శ్రీధర్, ప్రదీప్‌కుమార్, మల్లయ్య, వీరన్న పాల్గొన్నారు.

● సీరోలులో..



తొర్రూరులో జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీరోలు మండలకేంద్రంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో శంకర్ సంఘం పతకాన్ని ఆవిష్కరించగా భాస్కర్‌రావు, కృష్ణాకర్‌రెడ్డి, మంజుల, లక్ష్మీనర్సయ్య లక్ష్మి, శాంతకుమారి, విష్ణు, సోమేశ్వర్, కల్పన, రమ్య, హెచ్‌ఎం బంగారి, ఉపాధ్యాయులు మమత, సుభాషిణి, సునీల్, రవీందర్, ఐలయ్య, రవికిరణ్, ఉషారాణి, హారిక పాల్గొన్నారు.

● తొర్రూరు : రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తొర్రూరులో జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ, ఎస్‌కే.యాకూబ్, భిక్షపతి, నాగమల్లయ్య, వెంకటేశ్వర్లు, శేఖర్, వంశీకృష్ణ, చైతన్య, శ్రీనివాస్‌రెడ్డి, జంపన్న పాల్గొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీలో సెలైన్ బాటిల్‌లో నాచు రావడంతో విచారణ చేస్తోన్న డీఎంహెచ్‌వో కళావతి

దంతాలపలి, ఏప్రిల్13 : ప్రభుత్వం పంపిణీ చేసిన సెలైన్ బాటిల్‌లో నాచు రావడం పట్ల శనివారం జిల్లా వైద్యాధికారి కళావతి స్పందించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె దాట్ల గ్రామానికి చెందిన నరుకుటి సునీత ఇంటికి వెళ్లి పీహెచ్‌సీలో ఇచ్చిన ఆర్ఎల్, ఎన్ఎస్ సెలైన్ బాటిల్‌ను స్వాధీనం చేసుకొని విచారణ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో స్టాక్ ఉన్న సెలైన్ బాటిల్ వివరాలను సేకరించారు. సెలైన్‌లో నాచు ఎలా వచ్చింది, బాటిల్ వివరాలను పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో ఆర్ఎల్ బాటిల్‌కు సంబంధించి కోడింగ్ నెంబర్లను పరిశీలించామన్నారు. దీనిపై ఉన్నతస్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష, డీపీహెచ్ఎన్‌వీ అధికారి మంగమ్మ, వైద్యురాలు చైతన్య, సీహెచ్‌వో బాలాజీనాయక్, స్టాఫ్‌నర్సు కవిత, ఏఎన్ఎం సుభద్ర, ఫార్మసిస్టు రవీందర్ పాల్గొన్నారు.

వడదెబ్బ బాధితులకు వైద్యం అందాలి..

● మరిపెడ : వడ దెబ్బ బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రిలో సత్వరం వైద్య చికిత్సలు చేయాలని డీఎంహెచ్‌వో కళావతి పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. శనివారం ఆమె మరిపెడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ అటెండెంట్ రిజిస్టర్లను చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఎండల తీవ్రతతో వడ దెబ్బకు గురైన వారికి సత్వరం వైద్యం అందాలని సూచించారు. సన్‌స్ట్రోక్‌పై పల్లె ప్రజలను చైతన్య పరిచి నివారణ, జాగ్రత్త చర్యలపై వివరించాలన్నారు.

డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీశ, మరిపెడ మెడికల్ ఆఫీసర్ రవినాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంతరాణి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పూజలు

సీరోలు, ఏప్రిల్ 13 : కాంపల్లి శివారు సక్రాంనాయక్‌తండా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, మాజీ ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ శనివారం వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సక్రాంనాయక్‌తండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం. జంటనాగులు, ముత్యాలమ్మతల్లి దేవాలయాల ప్రారంభోత్సవం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. డాక్టర్ నెహ్రూరాథోడ్, శ్రీరాంనాయక్, ఆంజనేయస్వామి గుడి స్థల దాత బానోత్ సతీష్, జంట నాగులగుడి, విగ్రహదాత తేజావత్ రవీందర్. తోట రమేష్, పెద్ది వెంకన్న, తండాపెద్దలు, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

‘ప్రతీ రైలుకు ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలి’

కురవి, ఏప్రిల్13 : ప్రతీ ఎక్స్‌ప్రెస్ రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. నేరడలో ప్రధాన మంత్రి మోదీకి పోస్టుల కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 30 కోట్ల మంది రైళ్లద్వారా ప్రయాణాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. సీట్లు తక్కువగా ఉండడం, బోగీల్లో స్థలం లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి స్పందించి ప్రతీ రైలుకు ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సామాజికవేత్త కొండబత్తుల ఈశ్వర్‌కుమార్, కె.అంజనేయులు, మంజుర్‌ఆలీ, మడ్డి శ్రీపాల్, చందు వెంకన్న, మడ్డి నాగన్న, నాగభూషణం, ప్రసాద్, మహేశ్వర్, కల్పన, అరుణ, సంధ్యారాణి, మమత, సుజాత పాల్గొన్నారు.



నేరడలో ప్రధానికి పోస్టుకార్డులను పోస్టు చేస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : ప్రతీ రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి దివ్యసన్నిధికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల గాంధేయమార్గంలో ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ రోజు దేశవ్యాప్తంగా సుమారు 30 కోట్ల మంది రైళ్లలో ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. సాధారణ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వలన అందులో ప్రయాణించే సామాన్యులకు ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా టు దప్రైమ్ మినిస్టర్, ప్రైమినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్ రైసినా హిల్స్, న్యూఢిల్లీ- 110011 చిరునామాకు అభిప్రాయాలను తెలిపాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్ : 9989310141 ను సంప్రదించాలన్నారు.

శ్రీపార్వతిరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 13 : మాటేడులోని పూరాతనమైన రామలింగేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా శ్రీపార్వతిరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సహం నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకొని శ్రీరామనవమి వరకు నిర్వహించే నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సుంకరనేని సునీత పినాకపాణి దంపతులు పంచలోహ శివపార్వతుల విగ్రహాలకు సం ప్రోక్షణ, అభిషేకాలు, జలాభిషేకం, పుష్పాభిషేకం చేసి ఊరేగింపు అనంతరం రాత్రి శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కన్యదాతలుగా కలువకొలను ఝాన్సీ నరేన్ రాజు దంపతులు, దుర్గరాజు లక్ష్మీబాపేశ్వరి రజనీకాంత్ దంపతులు, వేదబ్రహ్మణులు రమేష్ శర్మ, శివశర్మ, శ్యామ్, క్రాంతి, ఈవో వేణుగోపాలచారి, డాక్టర్ నాగవాణి, లేగల వెంకటరెడ్డి, ప్రవీణ్‌రాజు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయించడం సరికాదు

తొర్రూరు, ఏప్రిల్ 13 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించడం సరికాదని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ రాము అన్నారు. శనివారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను, ఉపాధ్యాయులను విడివిడిగా విచారించారు. ఈనెల 10వ తేదీన పాఠశాల అటెండర్ ఉపాధ్యాయుడి ఆదేశాల మేరకు ఒక విద్యార్థి టేబుల్ స్టాండ్ ఎత్తుకుని ఉండగా తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా విద్యార్థులను బాలకార్మికులుగా మారుస్తున్నారనే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాఠశాలలో విచారణ చేపట్టామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశిస్తే నిబంధనలు పాటించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఎంఆర్‌సీ మల్లేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గడ్డిగూడెం తండాలో.. 40 లీటర్ల గుడుంబా ధ్వంసం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : మండలంలోని గడ్డిగూడెం తండాలో 40 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసంచేసినట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. తండాకు చెందిన ధరావత్ శాంతి, ధరావత్ సేవ్యా, భూక్య విజయ కలిసి గుడుంబా విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో వారిఇండ్లపై దాడులు నిర్వహించారు. వారి నుంచి 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎవరైనా గుడుంబా కాచినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మరిపెడ, ఏప్రిల్ 13 : ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం మహబూబాబాద్ సీసీఎస్ పోలీసులు శనివారం పట్టుకొని మరిపెడ పోలీసులకు అప్పగించారు. స్థానిక ఎస్సై తహెర్ తెలిపిన వివరాల ప్రకారం. బుర్హన్‌పురం గ్రామానికి చెందిన పెద్దబోయిన కృష్ణయ్య తనఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వచేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు అందిన నమ్మదగిన సమాచారంతో సీసీఎస్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారన్నారు. కృష్ణయ్యపై మరిపెడ పీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

17న చాగంటి కోటేశ్వర్‌రావు రాక



గూడూరు, ఏప్రిల్ 13 : మండలంలోని మదనాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయవక్త చాగంటి కోటేశ్వర్‌రావు రానున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు లింగాల సుధార్‌రెడ్డి తెలిపారు. మదనాపురంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల17న నిర్వహించి శ్రీరామ నవమి వేడుకలకు కోటేశ్వర్‌రావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆయన ప్రవచనాలను ఉపన్యాస రూపంలో అందించనున్నట్లు తెలిపారు. పురాణాల్లో అతని ఉపన్యా సాలు విస్తృతంగా అనుసరించబడతున్నా యని చెప్పారు. అనంతరం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తదనంతరం సుధీర్‌రెడ్డి బాల్య స్నేహితులతో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

18 నుంచి దర్గా షరీఫ్ ఉర్సు ఉత్సవాలు

గార్ల ఏప్రిల్ 13 : మండలంలోని మర్రిగూడెంలో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే దర్గా షరీఫ్‌ఉర్సు ఉత్సవాలను విజవంతం చేయాలని ఉత్సవాల ప్రధాన నిర్వాకుడు భూక్యా కాంతారావు బాబా కోరారు. ఉత్సవాల్లో భాగంగా 18 తారీకు గురువారం రోజున శ్రీబాలాజీ, బావ్‌సింగ్ బాబా, రాంసింగ్ బాబాలకు పూజలతో పాటు బంజారా దేవతకు భోగ్ బండారో కార్యక్రమం జరుగుతాయన్నారు. శక్రవారం హజ్రత్ సయ్యద్ యాకుబ్ షావలి, ముల్సార్ షావలిల జాతర ఉత్సవాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

శ్రీకోదండరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజ



కోదండరామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

గూడూరు, ఏప్రిల్ 13 : అప్పరాజుపల్లిలో శ్రీసీతా లక్ష్మణహనుమత్ సమేత శ్రీకోదండరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం నిత్యహోమాలు, ద్వారతోరణ బలి, మూర్తికుంభ ఆరాధన, మహాపూర్ణహుతి, ఉదయం 8.30కు స్వస్తిశ్రీ చాంద్రమాన ఉత్తరాయణ వసంత రుతువు పంచమి శనివారం మృగశిర నక్షత్రయుక్త మిథున లగ్నసుమూ హూర్తమున శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీకోదండ రామచంద్రస్వామి వారి, గరుడస్తంభ యంత్ర, ప్రతిష్టాపన, స్వామివారికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఈ వేడుక లకు గ్రామ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో అప్పరాజుపల్లిలో బంధువుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవపెద్ది విజయశ్రీ-విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవపెద్ది గీత-అమరేందర్‌రెడ్డి, ప్రముఖులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, వేముల వెంకటేశ్వర్లు, చందర్, జయపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కేసముద్రం, ఏప్రిల్ 13 : కేసముద్రం స్టేషన్ శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ఇటీవలె ఖమ్మంలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో) పరీక్షల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోల రాందాస్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో జోన్‌స్థాయిలో వి.చైత్ర ద్వితీయస్థానం, రోహిత్ మూడోస్థానం సాధించి స్మార్ట్‌వాచ్‌ను బహుమతిగా పొందారని తెలిపారు. ఈ బహుమతులను తాజా మాజీ సర్పంచ్ భట్టు శ్రీను అందజేయగా పాఠశాల డీన్ సుధాకర్, ఉపాధ్యాయులు కొమ్మాల వెంకట్‌రెడ్డి, రాజేశ్, సుమన్, కుమార్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని నలంద డిగ్రీ కళాశాలకరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక కళాశాలలో శనివారం తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని 'అంబేద్కర్ ఆలోచనలు-భారత రాజ్యాంగం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత వైశమ్యాలు లేని సమాజం, అవినీతి రహిత రాజకీయాలు దేశానికి అవసరమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనలను అమలు చేస్తే దేశం సమగ్రంగా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్, టీజేఎస్ బాధ్యులు ఇరుగు మనోజ్‌కుమార్, అధ్యాపకులు ప్రసాద్, రమేష్, రవి, ఉప్పలయ్య, నరేష్, ముత్తయ్య, పాష, కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేజావత్ బెల్లయ్యనాయక్‌కు సన్మానం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మానుకోట మండలం ఇస్లావత్ తండా మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్‌నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అలంకరించి ప్రజలకు సేవచేయాలన్నారు. ఆయన వెంట దర్శనం రామకృష్ణ, అంగోతు చందులాల్, గుగులోతు నరేష్, శివ, భీమా, నరేష్ ఉన్నారు.

ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి

గార్ల ఏప్రిల్ 13 : కోట్లాది రూపాయయల ఖనిజ సంపద బైరటీస్ తెల్లరాయి అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ముఠాపై చర్య తీసుకోవాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తాళ్లపల్లి కిష్టాగౌడ్, జిగట రమణ, బాదం సురేందర్ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు, టేబుళ్ల వితరణ



బెంచీలును అందించిన శ్వేత, సౌరవ్

కురవి, ఏప్రిల్ 13 : కందికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎన్నారై డాక్టర్ శ్వేత, బండి సౌరవ్ రూ.1.20 లక్షల విలువైన టేబుళ్లు, బెంచీలను అం దించారు. శనివారం వారి తల్లిదండ్రులు బండి జయశ్రీ- విజయ్‌కుమార్ చేతుల మీదుగా పాఠశాలకు బహూకరించారు. మాజీ సర్పంచ్ హేమలత, హెచ్ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు గోవర్ధన్, వీరస్వామి పాల్గొన్నారు.